వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్

47 మందికి స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం



శిల్పారామంలో స్వచ్ఛాంధ్ర లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి టౌన్/రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం బాగుంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. సోమవారం స్థానిక శిల్పారామంలో స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అనారోగ్యం బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. పచ్చదనాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. తల్లిపేరున మొక్కను నాటి పరిరక్షించాలన్నారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. అందరి భాగస్వామ్యంతో జిల్లాకు రెండు రాష్ట్ర స్థాయి, 47 జిల్లాస్థాయి అవార్డులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రజలు తడి, పొడిచెత్త వేర్వేరుగా చేసి చెత్త దిబ్బలో బాధ్యతగా వేయాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ప్లాస్టిక్ వాడకాన్ని మాని పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వచ్ఛతను పాటించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా అత్యంత ముఖ్యం అన్నారు. అంతకు ముందు మంత్రి సత్యకుమార్ ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన వైద్యఆరోగ్య స్టాల్‌ను సందర్శించారు. చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఉత్తమ సేవకులకు మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందచేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు పర్వీన్‌బాను, మంజునాథ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- మంత్రి సత్యకుమార్ యాదవ్
- తుమ్మలలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

ధర్మవరం రూరల్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని తుమ్మల గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుసేవాకేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని మంత్రి సత్యకుమార్.. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. రైతుసేవాకేంద్రం ద్వారా సబ్సిడీ విత్తనాలు, భూసార పరీక్షల కార్డులు, హార్టికల్చర్ పరికరాలు తదితర సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. 2018లో ఆయుష్మాన్ ఆరోగ్యమందిరాలకు నిధులు మంజూరు కాగా.. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రూ.1,200 కోట్ల నిధులను సమకూర్చి ఒక్కో ఆయుష్మాన్ మందిరానికి రూ.55 లక్షలు మంజూరు చేసిందన్నారు. అందులో రూ.45లక్షలు భవననిర్మాణానికి, రూ.10లక్షలు సిబ్బంది నియామకం, వైద్య పరికరాలకు వినియోగిస్తామన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఆగిపోయిన రైతుసేవాకేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాలను త్వరతగతిన పూర్తిచేయించి, ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి రాగానే ఎన్నడూ లేనివిధంగా సంక్షేమం, అభివృద్ధి దిశగా పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఫైరోజ్‌బేగం, ఎంపీడీఓ సాయిమనోహర్, నాయకులు చిగిచెర్ల ఓబిరెడ్డి, మహేష్ చౌదరి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు, గొట్లూరు సింగిల్ విండో చైర్మన్ మేకల రామాంజనేయులు, టీడీపీ రూరల్ అధ్యక్షుడు పోతుకుంట లక్ష్మన్న పాల్గొన్నారు.



ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.84.94 లక్షలు

కదిరి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి హుండీ ఆదాయం రూ.84.94 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆలయంలోని హుండీ సొమ్మును సోమవారం లెక్కించారు. 51రోజులకుగాను ఈ మొత్తం నగదుతోపాటు 6 గ్రాములు బంగారం, అర కిలో వెండి, 67 అమెరికన్ డాలర్లు, 20 నేపాలీ రూపాయలు, 2,800 ఇండోనేషియా కరెన్సీ, 160 ధర్హంలు, 5 రియాళ్లు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది. స్వచ్ఛంద సేవకులు, భక్తులు పాల్గొన్నారు.



హుండీ సొమ్ము లెక్కిస్తున్న భక్తులు



కృష్ణమ్మ నింపింది ఆనందం



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చిత్రపటాలతో చెరువులోకి దిగి ఆనందం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు, రైతులు

మడకశిర రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ రాకతో మడకశిర ప్రాంతం పులకించిపోతోంది. హంద్రీనీవా కాలువ ద్వారా వచ్చిన కృష్ణా జలాలతో మండలంలోని మణూరు చెరువు నిండడంతో సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి.. కృష్ణా జలాలకు హారతి ఇచ్చారు. బోటులో చెరువులో విహరించారు. అనంతరం వారు.. రైతులతో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలతో చెరువులోకి దిగి, ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో హంద్రీనీవా కాలువలు నిర్వీర్యం చేశారన్నారు. కాలువల్లో మరమ్మతులు పూర్తి చేసి, చివరి నియోజకవర్గాలకు కూడా నీరివ్వడం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపిన తర్వాత సీఎం వచ్చి జలహారతి ఇస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస మూర్తి, రాష్ట్ర ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ నాగరాజు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.







కలెక్టరేట్‌లో 205 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు 205 అర్జీలు సమర్పించారు. వాటిని స్వీకరించిన కలెక్టర్ శ్యాంప్రసాద్.. వెంటనే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుల చెంతకే ఎస్పీ



ఫిర్యాదిదారుతో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తిరూరల్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): వ్యయప్రయాసలకోర్చి జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన దివ్యాంగులు తమ సమస్యలను విన్నవించుకునేందుకు పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లోకి రాలేక ఇబ్బందులు పడుతుండడంతో ఎస్పీ సతీష్‌కుమారే వారి వద్దకెళ్లారు. వారి సమస్యలు తెలుసుకుని, తప్పకుండా పరిష్కరిస్తామని భరోసా నింపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లోకి రాలేని దివ్యాంగుల వద్దకు ఎస్పీనే వెళ్లి, వారితో మాట్లాడారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో అక్కడే ఫోన్‌లో మాట్లాడి, సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దివ్యాంగులు, మహిళల ఫిర్యాదులను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుని, పరిష్కరించాలన్నారు. ఎస్పీకి మొత్తం 65 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో మహిళా స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.











ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న కియ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫెసిలిటీ, కన్‌స్ట్రక్షన్, సేఫ్టీ హెడ్ సాంగ్జీ కిం



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం బూరుగుపల్లికి చెందిన గ్రీన్ అంబాసిడర్ ఎస్ దొడ్డప్ప

కోడిబాయె లచ్చమ్మదీ..!

- నాటు కోళ్లు మాయం చేస్తున్న ఆ ఇద్దరు
- క్వార్టర్ మందు.. రూ.200 ఇస్తే చాలు.. సరఫరా
- శింగనమలలో తరచూ బాధితులతో గొడవలు
- పోలీసులకు ఫిర్యాదు వెళ్లినా.. మందలింపుతో సరి

శింగనమల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నాటు కోడి కంటపడితే మాయం చేసేస్తున్నారు ఇద్దరు యువకులు. తెలిసినవాళ్లు ఫోన్ చేసి.. 'రేయ్ మామా.. కోడి..' అని అడిగిందే తడవు సరఫరా చేస్తున్నారు. వీరి దెబ్బకు ఇళ్ల వద్ద నాటు కోళ్లను పెంచుకునేవారు బెంబేలెత్తిపోతున్నారు. దొంగ కోళ్ల వ్యవహారం పోలీసుల వరకూ వెళ్లినా తేలిగ్గా తీసుకుంటున్నారు. 'కోడే కదా..' అని మందలింపుతో సరిపెడుతున్నారు. దీంతో ఆ ఇద్దరూ పేట్రేగిపోతున్నారని బాధితులు వాపోతున్నారు.



బస్టాండ్‌మే సవాల్..

సెప్టెంబరు 28వ తేదీ ఆదివారం..! పట్టణానికి చెందిన రామాంజనేయులు, చంద్రకళ దంపతుల నాటు కోళ్లు మాయమయ్యాయి. వారు వీధి కెక్కి తిట్ల దండకం ఎత్తుకున్నారు. ఆ దెబ్బకు మాయమైన కోళ్లు ఓ ఇంటి నుంచి కూత పెట్టుకుంటూ బయటకు పరిగెత్తుకు వచ్చాయి. ఆ ఇల్లు.. ఆ ఇద్దరు యువకుల బంధువులదట. దీంతో ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆ ఇద్దరు యువకులను రామాంజనేయులు నిలదీశాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తాని హెచ్చరించాడు. దీంతో గొడవ ముదిరి.. 'అవును.. మీ కోళ్లను మీమే తీసుకుపోయాం. ఇప్పుడు వదిలేశాం. మళ్లీ పట్టుకుపోతాం.. ఏం చేసుకుంటారు..?' అని ఆ యువకులు ఎదురు తిరిగారు. గొడవ ముదిరి పోలీస్ స్టేషన్ వరకూ వెళ్లింది. కోళ్లను దొంగతనం చేసింది కాక తమపై దాడి చేశారని దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మందు బాటిల్ ఇస్తే చాలు..

దొంగ కోళ్ల వ్యవహారం శింగనమలతోపాటు గుత్తి మండలం, కర్నూలు జిల్లాకూ విస్తరించినట్లు సమాచారం. మార్కెట్‌లో 'పల్లె నాటు'కు డిమాండ్ కూడా భారీగా ఉంది. ఈ లెక్కన దొంగ కోళ్లను పట్టుకుని ఆ ఇద్దరు యువకులు బాగా సంపాదిస్తున్నారేమో అనుకుంటే కోడి కూరలో కాలేసినట్లే..! ఓ రూ.200 నగదు.. క్వార్టర్ బాటిల్ మందు ఇస్తే చాలు.. నాటు కోడిని ఇచ్చేస్తారట. నాటు కోడి తినాలని అనిపిస్తే చాలు 'రేయ్ తమ్ముడూ.. నోరు చెడిపోయింది..', 'రేయ్ మామా.. ఫ్రెండొచ్చాడు..' అని ఫోన్ కొడతారట. బంధువులు, ఫ్రెండ్స్ వచ్చినా, బర్త్ డే పార్టీ అయినా.. చివరకు మూడ్ బాగాలేకపోయినా 'కస్టమర్లు' వీరిని సంప్రదిస్తున్నారట. నాటు కోడి రుచి చూడాలని అనుకునేవారికి ఈ ఇద్దరూ బెస్ట్ సర్వీస్ చేస్తున్నారని ప్రచారం ఉంది. కనీసం రూ.1000 పెడితేగానీ దొరకని నాటుకోడిని వీరు రూ.200కే ఇచ్చేస్తున్నారని సమాచారం. కస్టమర్లు వీరిని లైన్‌లో పెట్టుకునేందుకు మందు బాటిల్‌ను కానుకగా ఇస్తున్నారని అంటున్నారు. అదీ.. ఓ సినిమా హీరో వాడే బ్రాండ్ అట..! ఈ ఇద్దరికి ఇద్దరు పోలీసులతో సత్సంబంధాలు ఉన్నాయనే ప్రచారం ఉంది.

రేయ్.. మా పేరు చెప్పకండ్రా..

పది రోజుల క్రితం బస్టాండు వద్ద జరిగిన దొంగ కోళ్ల గొడవ స్టేషన్ వరకూ వెళ్లడంతో ఆ ఇద్దరు యువకులను పోలీసులు పిలిపించారు. దీంతో తమ పేర్లు ఎక్కడ బయట పెడతారోనని దొంగ కోళ్లను వండుకుతిన్నవారు బెంబేలెత్తిపోయారు. ఏం జరుగుతుందో చూద్దామని కొందరు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి పరిణామాలను గమనించారు. మరికొందరు తెలిసినవారి చేత పోలీసులకు ఫోన్‌లు చేయించుకున్నారని సమాచారం. కేసు కట్టకపోయినా, ఆ రోజు నుంచి ఆ ఇద్దరు యువకులు స్టేషన్‌కు వచ్చిపోతున్నారు. దీంతో 'రేయ్.. మా పేరు చెప్పకండ్రా..' అని 'రుచి చూసినవారు' బతిమాలుతున్నారట.

కేసు నమోదు చేస్తాం..

నాటు కోళ్ల విషయంలో దాడి జరిగినట్లు ఫిర్యాదు వచ్చింది. పది రోజులుగా తిరుమల విధుల్లో ఉన్నాం. ఇన్‌చార్జి ఎస్ఐ ఉన్నందున కేసు నమోదు చేయలేదు. ఇద్దరు యువకులపై గతంలోనూ ఫిర్యాదులు ఉన్నాయని తెలిసింది. విచారించి కేసు నమోదు చేస్తాం.

- విజయ్‌కుమార్, ఎస్ఐ, శింగనమల

ఇది రైతేనా..?

పీఏబీఆర్ కుడికాలువపై నిర్లక్ష్యం

- పెరిగిన కంపచెట్లు .. దెబ్బతిన్న గట్లు
- నీరు వదిలితే ముందుకు సాగడం కష్టం
- ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

కూడేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ (పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) కుడి కాలువ పూర్తిగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ పీఏబీఆర్ నుంచి ధర్మవరం చెరువు వరకు 113 కిలోమీటర్ల దూరం ఉంది. కంపచెట్లు పెరగడంతో కాలువ గట్టు దెబ్బతింది. అండర్ బ్రిడ్జిలకు రంధ్రాలు పడి, సైడ్ వాల్ కుంగిపోయింది. మరమ్మతులు చేయకపోవడంతో వచ్చిన నీరంతా వంకలపాలవుతోంది. పీఏబీఆర్ నీటిని దాదాపు 48 చెరువులకు తరలించేందుకు కుడికాలువను ఏర్పాటు చేశారు. అయితే దీని పర్యవేక్షణను గాలికొదిలేయడంతో కాలువ పూర్తిగా దెబ్బతింది. డ్యాం నుంచి 25వ కిలోమీటరు వరకు కాలువ పూర్తిగా దెబ్బతింది. డ్యాం నుంచి 15వ కిలోమీటరులోపు ఎక్కువ నీరు లీకై వంకల్లోకి వెళుతోంది. జల్లిపల్లి సమీపంలోని 4వ కిలోమీటర్ వద్ద గొరవయ్యదార్ల వద్ద అండర్ బ్రిడ్జికి భారీ రంధ్రాలు పడ్డాయి. దీనికి తోడు సైడ్ వాల్ పూర్తిగా కుంగిపోవడంతో భారీగా నీరు బయటకు వెళ్తున్నట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. 6వ కిలోమీటరు వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కాలువ వెళ్లే దారిలో ఉన్న వంకల వద్ద నిర్మించిన అండర్ బ్రిడ్జిలు ఎక్కువగా అటవీ ప్రాంతంలో ఉండటంతో వాటి మరమ్మతులు సక్రమంగా చేయలేదు. కాలువకు నీరు వదలిన సమయంలో ఇరిగేషన్ అధికారులు నానా హడావుడి చేస్తారు. నీరు బయటకు వెళ్లే ప్రదేశంలో ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకుంటున్నారు. నీరు నిలిచిన తర్వాత అటు వైపు కన్నెత్తి చూడరు. దీంతో కాలువకు ఇరువైపులా కంప చెట్లు పెరిగిపోయాయి. కాలువ మధ్యలో పిచ్చి మొక్కలు, జనుము గడ్డి ఏపుగా పెరగడం, కాలువ సైడ్ వాల్ దెబ్బతిని రాళ్లు కాలువలో పడి నీటి ప్రవాహాన్ని నిరోధిస్తున్నాయి. దీంతో చెరువులకు నీరు చేరక రైతులు ఇబ్బంది పడుతున్నారు.



కుడికాలువ గట్లపై పెరిగిన కంపచెట్లు

రూ.కోటిన్నరతో ప్రతిపాదనలకు పంపితే...

డ్యాం నుంచి 25 కిలోమీటరు వరకు ఒక సబ్ డివిజన్, 26 నుంచి 113 కిలోమీటరు వరకు మరో సబ్ డివిజన్‌గా విభజించారు. దీంతో డ్యాం నుంచి 25 కిలోమీటరులోపు దెబ్బతిన్న కాలువ మరమ్మతులు చేయడానికి రూ.కోటిన్నరతో 13 పనులకు ప్రతిపాదనలు పంపితే రూ.8 లక్షలతో కంపచెట్లు తొలగించడం, లీకేజీల నివారణ పనులకు నిధులు కేటాయించారు. మిగిలిన పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో తిరిగి ప్రతిపాదనలు పంపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

113 కిలోమీటరు వరకు రూ.రెండు కోట్లు మంజూరు..

పీఏబీఆర్ కుడికాలువ 26 కిలోమీటరు నుంచి 113 కిలోమీటరు వరకు దాదాపు రూ.2 కోట్లతో 23 పనులు మంజూరు అయ్యాయి. దీంతో కాలువ పనులు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాలువకు నీరు వదిలితే అత్యధికంగా నీరు వృథాగా బయటకు వెళ్లే ప్రదేశం కూడేరు మండలంలోనే ఉంటుంది. ఉన్నతాధికారులు నీటి వృథాను అరికట్టేందుకు పనులు మంజూరు చేయకపోవడం గమనార్హం.



నాలుగున్నర కిలోమీటరు వద్ద దెబ్బతిన్న కాలువ గట్టుకు వేసిన ఇసుక బస్తాలు

నీటి వృథాని అరికట్టాలి



డ్యాం నుంచి జల్లిపల్లి గ్రామం వరకు నీరు పెద్ద ఎత్తున లీకై వృథాగా వంకలోకి వెళ్తుంది. అండర్ బ్రిడ్జిలకు పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడి నీరు బయటకు వచ్చి వంకలోకి చేరుతోంది. అలాగే పొలాల్లోకి నీరు చేరుతుండటంతో పంటలు సాగు చేయడానికి అవకాశం లేకుండా పోతోంది. కాలువ దెబ్బతిన్న ప్రాంతంలో మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలి.

- చంద్ర, రైతు, ఉదిరిపికొండ



4వ కిలోమీటరు వద్ద అండర్ బ్రిడ్జికి ఏర్పడ్డ రంధ్రం

త్వరగా నీరు విడుదల చేయాలి



పీఏబీఆర్ డ్యాం నుంచి కుడికాలువ ద్వారా చెరువులను పూర్తి స్థాయిలో నీటితో నింపాలి. వేసవి కాలంలో నీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. ముందస్తుగా చెరువుల్లో నీటిని నింపితే మూగజీవాలతోపాటు ప్రజలకు దాహం తీరుతుంది. చెరువులో నీరు ఉండటం వల్ల భూగర్భ జలాలు పెరిగి, బోరుబావులు ఎండిపోకుండా ఉంటాయి. దీంతో అన్నదాతలు సాగు చేసిన పంటలకు నీటి గండం తప్పుతుంది. అధికారులు త్వరగా కుడికాలువకు నీరు విడుదల చేయాలి. -కృష్ణమూర్తి, జిల్లా ప్రధానకార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం

ఏరికోరి..!

- డిప్యూటీ ఎంపీడీఓ స్థానం కోసం తీవ్రపోటీ
- వారంలోపు పలువురికి ప్రమోషన్లు
- ఏరి కోరుకుంటున్న ఆశావహులు
- ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓ స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొంది. కోరుకున్న స్థానం దక్కించుకునేందుకు ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న డిప్యూటీ ఎంపీడీఓ స్థానాలను భర్తీ చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే అర్హులైన వారి నుంచి ఏసీఆర్ (యానివల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్)లు కూడా సేకరించింది. వారం లోపే ప్రమోషన్ల ప్రక్రియ ముగించి ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రమోషన్ తథ్యమనుకున్న ఆశావహులు కోరుకున్న స్థానం దక్కించుకోవడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రధానంగా అనంతపురం జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉండే రాప్తాడు డిప్యూటీ ఎంపీడీఓ స్థానానికి గట్టి పోటీ నెలకొన్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల నుంచి గ్రీన్‌సిగ్నల్ తీసుకున్నట్లు తెలిసింది.

ఖాళీలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓ ఖాళీలు ఇలా ఉన్నాయి. తాడిపత్రి, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, రాప్తాడు, రామగిరి, రొద్దం, మడకశిర, రొళ్ల, అమరాపురం, పెనుకొండ, లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల, కొత్తచెరువు, నల్లచెరువు, కదిరి, తలుపులకు ప్రస్తుతం ఇన్‌చార్జులుగా డిప్యూటీ ఎంపీడీఓలు ఉన్నారు. బ్రహ్మసముద్రంలో పని చేస్తున్న మాధవికి ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి రావడంతో ఆ స్థానం ఖాళీ అయింది. పెనుకొండలో కమళాబాయి, నల్లచెరువులో శకుంతల, రాప్తాడులో ఆనంద్ ప్రసాద్‌కు కొన్ని రోజుల కిందట ఎంపీడీఓగా ప్రమోషన్ ఉత్తర్వులు రావడంతో డిప్యూటీ ఎంపీడీఓ సీట్లు ఖాళీ అయ్యాయి. ఇప్పుడు ఆ స్థానాలను కూడా ప్రమోషన్ పొందే వారితో భర్తీ చేయనున్నారు.

ప్రమోషన్ జాబితాలో కార్యదర్శులు ఇలా...

జిల్లాలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పని చేస్తూ డిప్యూటీ ఎంపీడీఓ ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్న వారి జాబితాను ఇప్పటికే ప్రభుత్వానికి పంపారు. వారిలో చంద్రశేఖర్, సాదిక్‌వలి, సాదిక్, అశోక్ బాబు, గోపాల్, శ్రీనివాసరెడ్డి, ప్రేమ్‌కుమార్, ఎమ్ఎల్ఎన్ ప్రసాద్, ఎంవీ ప్రసాద్, సుధాకర్ కుమార్, భాస్కర్, అబ్దుల్ మునాఫ్, ఇబ్రహీం, ఎర్రిస్వామి, ఏవీ రమణ, బాబురావు ఉన్నారు. డీపీఓ కార్యాలయం ప్యానల్ నుంచి సీనియర్ అసిస్టెంట్లు మనోహర్, శివప్రసాద్ ఉన్నారు. జిల్లా పరిషత్ ప్యానల్ నుంచి సీనియర్ అసిస్టెంట్లు అచ్చితానంద బాబు, లెక్కలు శ్రీనివాసులు, రంగనాయకులు, హనుమంతు, మల్లికార్జున, రాజశేఖర్ ఉన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ప్రమోషన్లను కాదనుకుని ఏఓలుగా వెళ్లడానికి మల్లికార్జున, హనుమంతు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో జిల్లా పరిషత్ ప్యానల్ నుంచి నలుగురు బరిలో ఉన్నారు. ఆయా వర్గాల నిష్పత్తులకు అనుగుణంగా వారంలోపు 10 మంది జాబితా విడుదల చేసి, మిగిలినవి త్వరలో విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.



డీపీఓ కార్యాలయం

ప్లేస్‌మెంట్ కోసం పోటీ

ప్రస్తుతం ప్రమోషన్లు పొందే ఉద్యోగుల్లో ప్లేస్‌మెంట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. ప్రధానంగా రాప్తాడుకు సంబంధించి ఐదుగురు పోటీ పడుతున్నట్లు సమాచారం. స్థానిక ఎంపీడీఓ మాత్రం జడ్పీ ప్యానల్ నుంచి వచ్చే సీనియర్ అసిస్టెంట్ అచ్చితానందబాబునే డిప్యూటీ ఎంపీడీఓగా ఖరారు చేయించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. కార్యదర్శుల నుంచి అశోక్‌బాబు, గోపాల్, ప్రవీణ్‌కుమార్, ప్రేమ్‌కుమార్ లు కూడా ఎవరి ప్రయత్నం వారు చేస్తున్నట్లు సమాచారం. పెనుకొండ, గోరంట్ల, కొత్తచెరువు, కదిరి ప్రాంతాలకు కూడా డిమాండ్ ఉంది. ఎవరి పరిధిలో వారు స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. వారు కోరిన ప్లేస్‌మెంట్ దొరికితే లక్షల్లో ముడుపులు ముట్టచెప్పడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

ధర చెప్పకపోతే ఒప్పుకోం

- భూసేకరణపై రైతులు
- అధికారుల తీరుపై నిరసన



రోడ్డుపై బైఠాయించిన రైతులు

హిందూపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): 'పరిశ్రమలకు మేం వ్యతిరేకం కాదు. అయితే ఉన్నతాధికారులు రాకుండా వీఆర్ఓలతోనే భూసేకరణ చేస్తామంటే ఒప్పుకునే పరిస్థితి లేదు. ధర ఎంతో చెప్పకుండా పాసుపుస్తకాలు, అకౌంట్ పుస్తకాలు అడగడం ఏంటి' అని రైతులు ప్రశ్నిస్తున్నారు. హిందూపురం మండలం చలివెందుల, మలుగూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం భూసేకరణకు శ్రీకారం చుట్టింది. అయితే ఇప్పటి వరకు అక్కడ గ్రామసభలు పెట్టినా ఉన్నతాధికారులు వెళ్లకుండా వీఆర్ఓలతోనే సరిపెట్టడంపై ఆయా గ్రామాల రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం మండలంలోని చలివెందుల, మలుగూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో 12పల్లెలకు సంబంధించిన 8వేల ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఇందుకోసం భూములు సేకరిస్తున్నట్లు అధికారులు సంబంధిత రైతులకు చెప్పారు. కానీ ఇప్పటి వరకు ధర చెప్పలేదు. అయితే నందమూరి నగర్ వద్ద సోమవారం గ్రామసభ పెట్టి భూమి పాసుపుస్తకాలు, ఆధార్, బ్యాంక్ ఖాతా పుస్తకాలు తీసుకురావాలని దండోరా వేయించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో హిందూపురం-గోరంట్ల ప్రధానరహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములు కోల్పోతున్న గ్రామాల పరిధిలో నాలుగు వరుసల జాతీయరహదారి నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం ఎకరాకు రూ.29లక్షలు నష్టపరిహారం ఇచ్చారు. రైల్వే లైనుకు సేకరించిన భూమికి కూడా అదే ధర చెల్లించారు. ఇప్పుడు అదే తరహాలో పరిశ్రమల కోసం సేకరిస్తున్న భూములకు ధర ఇస్తామంటే అభ్యంతరం లేదన్నారు.

వాణిజ్య పంటలున్న భూములు వదిలేయాలి

: చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ చలివెందుల



పరిశ్రమలు పెడతామంటే మేం వ్యతిరేకించం. కానీ ఈగ్రామాల పరిధిలో దీర్ఘకాలిక వాణిజ్య పంటలు వక్క, మామిడితోపాటు మరికొన్ని పంటలున్నాయి. అలాంటి భూములు వదిలేసి న్యాయబద్ధమైన ధర చెల్లిస్తే భూములు ఇవ్వడానికి మేం సిద్ధంగా ఉన్నాం.

2013 భూసేకరణ చట్టం అమలు చేయాలి

: సిద్దారెడ్డి, రైతు సంఘం నాయకుడు, రాచపల్లి



2013భూసేకరణ చట్టం ప్రకారం రైతుల నుంచి సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించాలి. మొదట కలెక్టర్, లేదా జాయింట్ కలెక్టర్ వచ్చి గ్రామసభలు ఏర్పాటుచేసి ధర ఎంత ఇస్తారో చెప్పాలి. ఏయే పరిశ్రమలు ఏర్పాటు చేస్తారో ప్రజలకు వివరించాలి. అలాకాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపి భూములు లాక్కుంటామంటే ఒప్పుకోం.

ఉన్న భూమినైనా వదిలేయండి : శివలింగారెడ్డి, రైతు



గతంలో హంద్రీనీవా కాలువ కోసం నాకున్న ఆరు ఎకరాల భూమిలో నాలుగు ఎకరాలు తక్కువ ధరకే తీసుకున్నారు. ఉన్న రెండెకరాల్లో పంటలు సాగుచేసి జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు మళ్లీ పరిశ్రమల పేరుతో భూమి తీసుకుంటే మా పరిస్థితి ఏంటి. ఇప్పుడు ఉన్న భూమినైనా వదిలేయాలి.

నేటి నుంచి పెదయ్యస్వామి ఉత్సవాలు

- రెండురోజులపాటు నిర్వహణ
- 50వేల మంది హాజరవుతారని అంచనా

తాడిమర్రి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన ఆర్వేడుపట్నం పెదయ్యస్వామి జలధిపూజ, పెద్దమ్మ, యల్లమ్మ సాగు ఉత్సవాలను మంగళవారం నుంచి రెండు రోజులపాటు తాడిమర్రిలో నిర్వహించనున్నారు. కురుబ కులస్థులైన ఆర్వేటివారు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 3గంటలకు పుట్టకు పూజ చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి 11గంటలకు అమ్మవారి గంగపూజ, ఘటం ఊరేగింపు జరుగుతాయి. వివిధ గ్రామాల నుంచి హాజరయ్యే 25 రకాలగుడికట్ల స్వాములు మంగళవారం సాయంత్రం 5గంటలకే ఉత్సవ ప్రాంగణానికి చేరుకుంటాయని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. 8వ తేదీ తెల్లవారుజామున 4గంటల నుంచి 6గంటల వరకు ఆర్వేడు పట్నం పెదయ్యస్వామికి పుణ్యాహవచనం, గంగపూజ,రుద్రాభిషేకం, బిందెపూజ, మహామంగళహారతి, బలిహారం జరుపుతామన్నారు. ఈ ఉత్సవాలకు దాదాపు 50వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

ఆర్వేడుపట్నం పెదయ్యస్వామి ఉత్సవాల ఏర్పాట్లను ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ స్థానిక ఎస్ఐ క్రిష్ణవేణితో కలిసి పరిశీలించారు. సభాప్రాంగణం, స్వాములు భేటీ అయ్యే ప్రాంతం, పార్కింగ్‌స్థలం, అన్నదాన ఏర్పాట్లను పరిశీలించి స్థానిక సిబ్బందికి సూచనలు చేశారు. దాదాపు 150 మందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్‌ను కూడా మళ్లించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. పులివెందుల నుంచి ధర్మవరం వైపునకు వెళ్లే వాహనాలు చిల్లకొండయ్యపల్లిక్రాస్ నుంచి కునుకుంట్ల, మద్దెల చెరువు, తాడిమర్రి సబ్‌స్టేషన్ మీదుగా వెళ్లాలని ఎస్ఐ తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ హేమంత్ కుమార్

ఆగని ఆక్రమణలు

- యథేచ్ఛగా కోడూరు మన్రో తోపులో కబ్జాలు
- ఎక్స్‌కవేటర్‌తో స్థలాల చదును
- అధికారుల హెచ్చరికలు బేఖాతరు
- బరితెగించిన కబ్జారాయుళ్లు

చిలమత్తూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు మన్రో తోపులో ఆక్రమణలు ఆగడం లేదు. ఇటీవల 44వ జాతీయ రహదారితో పాటు 342 జాతీయ రహదారులు విస్తరణ జరుగుతుండటంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను అధికారులు తొలగించారు. అయితే ఆ దుకాణ దారులు పంచాయతీకి సంబంధించిన మన్రో తోపు భూమిలో ఆక్రమణలకు తెరలేపారు. గతంలో ఇదే మన్రో తోపులో స్థలాలను ఆక్రమించి, భవంతులు నిర్మించి వ్యాపారాలను చేసుకుంటూ వచ్చారు. ఇప్పుడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు తొలగించడంతో కొందరు మన్రో తోపులోని స్థలాలను కబ్జా చేయడానికి యత్నిస్తున్నారు. మన్రో తోపులో స్థలాల కబ్జా విషయంపై ఆంధ్రజ్యోతి పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దానికి పంచాయతీ ఉన్నతాధికారులు స్పందించి కబ్జా చేసిన స్థలాలను పరిశీలించారు. కబ్జా చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అయితే అధికారులు అలా వెళ్లారో లేదో అదే కబ్జారాయుళ్లు కోదండ రామాలయం సమీపంలో స్థలాలను యంత్రాల ద్వారా చదును చేయించారు. పంచాయతీ అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేశారు. వారం రోజుల కిందట కూడా కొందరు కబ్జాలకు పాల్పడటంతో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కబ్జారాయుళ్లు యథేచ్ఛగా సోమవారం ఎక్స్‌కవేటర్ల ద్వారా స్థలాలను చదును చేసుకున్నారు. దీనిపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోదండ రామాలయ ప్రాంగణమంతా కబ్జా చేస్తే భవిష్యత్తులో ఆలయ ఉత్సవాలను ఎలా జరుపుకోవాలని ప్రశ్నిస్తున్నారు. సెంటు భూమి ధర లక్షల్లో ఉంటున్న ఈ ప్రదేశంలో కబ్జాలు జరగడం విమర్శలకు తావిస్తోంది. కలెక్టర్ కోడూరు మన్రో తోపులో జరుగుతున్న ఆక్రమణలపై దృష్టి పెట్టి, అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



స్థలాలను చదును చేస్తున్న యంత్రాలు

కౌన్సెలింగ్ ఇచ్చాం: మునీర్ అహమ్మద్, ఎస్ఐ

వారం రోజుల కిందట మన్రో తోపులో జరిగిన ఆక్రమణలపై పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఫిర్యాదు చేశారు. ఆక్రమణలకు పాల్పడిన వారిని స్టేషన్‌కి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చాం. అయితే సోమవారం జరిగిన ఆక్రమణలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నిజాలు నిగ్గుతేలేనా..?

శిశుమరణంపై అనుమానాలెన్నో... | **ఇప్పటికే త్రిసభ్య సంఘం నివేదిక**

- ఐసీడీఎస్ డైరెక్టర్ విచారణ
- ఐదు గంటల పాటు ప్రశ్నల వర్షం
- సుమోటోగా కేసు నమోదు

అనంతపురం వైద్యం/క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నవజాత శిశువు మృతికి కారణాలపై నిజాలు నిగ్గుతేలేనా..? అన్న ప్రశ్న సర్వత్రా నెలకొంది. శిశుకేంద్రం సిబ్బందిలో నిబద్ధత కొరవడటం, పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం ప్రధాన కారణాలు అన్న చర్చలు వినిపిస్తున్నాయి. చిన్నపిల్లల వైద్యుడు కూడా లేకపోవడం శోచనీయం. ఈ పరిస్థితుల నేపథ్యంలో గురువారం నవజాత శిశువు మృతిపై నెల కొన్న అనుమానాలు నివృత్తి అవుతాయా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. త్రిసభ్య సంఘం ఆదివారం శిశుగృహను సందర్శించి, సంబంధిత అధికారులు, సిబ్బందిని విచారించిన విషయం తెలిసిందే. రాష్ట్ర మాతా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి సోమవారం శిశుకేంద్రానికి చేరుకుని సిబ్బంది, అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ నేపథ్యంలో శిశువు మరణ సమాచారాన్ని బయటకు పంపిందెవరని తీవ్రస్థాయిలో డైరెక్టర్ ప్రశ్నించినట్లు సమాచారం. ఈ పరిణామాల క్రమంలో జిల్లా న్యాయశాఖ సుమోటోగా కేసు నమోదు చేయడం, జిల్లా న్యాయసేవాసాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ శిశుగృహను తనిఖీ చేయడం తీవ్రచర్చకు దారితీసింది. శిశువు మృతిపై జిల్లా జడ్జి భీమారావు ఆదేశాలతో జిల్లా న్యాయసేవాసాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ సోమవారం శిశుగృహకు వెళ్లి అక్కడి మేనేజర్, అధికారులు, సిబ్బందితో శిశువుమృతిపై వివరాలను ఆరాతీశారు. శిశువును కేంద్రానికి తీసుకొచ్చినప్పటి నుంచి జరిగిన పరిణామాలపై లోతుగా విచారించారు.

మూల్యం తప్పదా...?

నిరాదరణకు గురైన అనాథ శిశువులను సంరక్షించేందుకు శిశుగృహ కేంద్రాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. కొన్నేళ్ల క్రితం వరకు పదుల సంఖ్యలో శిశువులను అక్కున చేర్చుకుని సంరక్షించేవారు. ఆరేళ్ల వయసు వచ్చేవరకు సంరక్షించి, ఆ తరువాత పిల్లలులేని దంపతులకు దత్తత ఇస్తారు. దత్తత ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారానే నడుస్తోంది.


మాతా, శిశు సంక్షేమశాఖ అధికారులను ప్రశ్నిస్తున్న డైరెక్టర్

ప్రస్తుతం శిశుగృహలో నలుగురు శిశువులు మాత్రమే ఉన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఒక మహిళ పోషించలేక తన బిడ్డను ఆగస్టు 30న శిశుగృహకు అప్పగించింది. శిశువును చేర్చినప్పటి నుంచి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. శిశువుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా చిన్నపిల్లల వైద్యుడిని ఏర్పాటుచేయాలి. ఇందులో భాగంగా ఒక ప్రైవేటు డాక్టర్‌ను నెలకు రూ.6వేల పారితోషికం ఒప్పందంతో నియమించారు. సదరు డాక్టర్ సమాచారం లేకుండానే శిశుగృహకు రావడం మానేశారు. శిశువుల ఆలనాపాలన చూసుకునేందుకు ఆరుగురు ఆయాలను నియమించారు. వీరిలో ఒక ఆయా ఉద్యోగ విరమణ పొందగా.. మరొకరు రిజైన్ చేసి వెళ్లిపోయారు. మిగిలిన నలుగురు శిశువుల ఆలనాపాలన చూసుకుంటున్నారు. ముగ్గురు ఆయాలకు పగలు, ఒకరికి రాత్రి విధులు కేటాయించారు. అర్ధరాత్రి శిశువులకు అనారోగ్య పరిస్థితులు తలెత్తితే ఒక ఆయా చూసుకోలేని పరిస్థితులున్నట్లు సమాచారం. ఉన్న ఒక నర్సు నిత్యం శిశువుల ఆరోగ్య సంరక్షణ చూసుకోవాల్సి వస్తోంది.

దిద్దుబాటు చర్యలు తీసుకునేరా..?

పలు కారణాలతో శిశుగృహలో ఓ మగ శిశువు ప్రాణం బలైంది. కేంద్రం నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో అక్కడి శిశువుల సంరక్షణలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం శిశుగృహలో సంరక్షణలోని శిశువులకు మెరుగైన సేవలందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. శిశుగృహ నిర్వహణ గాడిలో పెట్టడంతోపాటు అక్కడి అధికారులు, సిబ్బంది మధ్య ఎలాంటి విభేదాల్లేకుంటా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. డాక్టర్‌ను నియమించడంతోపాటు తరచూ శిశువులకు వైద్యపరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రశ్నల వర్షం

శిశుగృహలో నవజాత శిశు మరణంపై మహిళా, శిశు సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి విచారణ చేపట్టారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఐసీడీఎస్ పీడీ నాగమణి, డీసీఎం బీఎస్ శ్రీదేవి ఆధ్వర్యంలో డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి.. శిశుగృహ సిబ్బందిపై ప్రశ్నల వర్షం కురిపించారు. దాదాపు 5 గంటలపాటు ఏకబిగిన కొనసాగిన విచారణలో వెల్లడైన అంశాలను నివేదిక రూపంలో విజయవాడకు తీసుకెళ్లారు. విచారణపై వేణుగోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. నవజాత శిశువు మరణించిన విషయంపై క్షేత్రస్థాయిలో విచారణ చేపటటాట్టామన్నారు. శిశుగృహ సిబ్బంది పనితీరు, శిశువుల సంరక్షణ తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో విచారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా శిశుగృహ సిబ్బందిని ఒక్కొక్కరిగా విచారణ చేశామన్నారు.

సిబ్బందిలో గుబులు

నవజాత శిశువు మరణాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. మాతా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తీవ్రంగా పరిగణించారు. శిశు మరణానికి కారణాలపై డైరెక్టర్ వేణుగోపాల్‌ను క్షేత్రస్థాయి విచారణకు పంపడం, బృందంగా కాకుండా ఒక్కొక్కరిని వేరుగా విచారించడం, అక్కడికక్కడే వివరాలను నమోదు చేసుకోవడంతో కేంద్రం సిబ్బందిలో గుబులు రేగుతోంది. ఎవరు ఏమి చెప్పారో?, తనపై ఏవైనా పిర్యాదులు చేశారా? ఇలా అనేక ప్రశ్నలు సిబ్బందిని వెంటాడుతున్నాయి. ఎవరిపై వేట పడుతుందోనని ఆందోళనలో ఉన్నట్లు సమాచారం.

క్రైం కార్నర్

బంగారం షాపు యజమానికి టోకరా

- నకిలీ బంగారం అంటగట్టిన దంపతులు

ఉరవకొండ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ జ్యూవెలరీ షాపు యజమానికి ఓ మహిళ నకిలీ బంగారాన్ని అంటగంటి రూ.1.3లక్షల కాజేసిన సంఘటన సోమవారం జరిగింది. బళ్లారి రోడ్డులోని సీఎస్ఐ చర్చి సమీపంలో ఉన్న జ్యూవెలరీ షాపునకు భార్య, భర్త వచ్చారు. తమ కుమార్తె పెళ్లి ఉందని, పాత బంగారాన్ని తీసుకుని కొత్త బంగారు కమ్మలు ఇవ్వాలని అడిగారు. తొలుత తన వద్ద ఉన్న బంగారు గొలుసును మహిళ షాపు యజమానికి ఇచ్చారు. దాన్ని పరీక్షించిన అతడు ఆరు గ్రాముల కమ్మలతో పాటు, రూ.40వేల నగదు ఇస్తానని చెప్పారు. అయితే కూతురు పెళ్లి పెట్టుకున్నామని, కాస్తా ఎక్కువగా ఇవ్వాలని అడిగి, బంగారు షాపు యజమానికి ఇచ్చిన గొలుసును తీసుకున్నారు. షాపు యజమాని ఏమరుపాటుగా ఉండటం గమనించి క్షణాల్లోనే తన వెంట తెచ్చుకున్న, అచ్చం అలాగే ఉన్న నకిలీ గొలుసును బయటకు తీసి అతడికి ఇచ్చారు. అతడు దీనిని గమనించకుండానే నగదు, బంగారు కమ్మలు ఇచ్చాడు. దీంతో దంపతులు అక్కడి నుంచి ఉడాయించారు. కొద్దిసేపటి తర్వాత దుకాణం యజమాని గొలుసును పరీక్షించగా, అది నకిలీ బంగారం అని గుర్తించి, మోసపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమ దృష్టికి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

బాలిక కిడ్నాప్.. వ్యక్తిపై పోక్సో కేసు

యాడికి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళుతున్న బాలికను కిడ్నాప్ చేసిన బత్తుల కృష్ణారెడ్డిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. ఆయన తెలిపిన మేరకు ఈ నెల 3న 9వ తరగతి చదువుతున్న బాలిక పాఠశాలకు వెళుతుండగా కుందనకోట గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కిడ్నాప్ చేశాడు. బాలికను కసాపురం తీసుకువెళ్లి వివాహం చేసుకున్నాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కృష్ణారెడ్డిపై పోక్సో కేసు, కిడ్నాప్ కేసు, మైనర్‌ను వివాహం చేసుకున్న కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం వేములపాడు క్రాస్‌వద్ద ఉన్న కృష్ణారెడ్డిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

అనంతపురం న్యూటౌన్, గుత్తి, ధర్మవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. కేంద్రంలోని స్థానిక తాటిచెర్ల-అనంతపురం రైల్వేస్టేషన్ల మధ్యలోని నేషనల్ హైవే బ్రిడ్జి వద్ద సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ వెంకటేసులు తెలిపారు. మృతుడు అనంతపురం రూరల్ మండలంలోని నారాయణపురానికి చెందిన మల్లెల పోతన్న కుమారుడు మల్లెల రవికుమార్ (43)గా గుర్తించినట్లు పేర్కొన్నారు. గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లాడని, కిందపడి బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపాన గుర్తుతెలియని వ్యక్తి(40) రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. రైలు నుంచి కిందపడ్డాడా, రైలు కింద పడి చనిపోయాడా అన్నది తెలియాల్సి ఉందన్నారు. మృతుడు చామన చాయ వైట్ షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి కాలేదని..


మహేశ్ (ఫైల్)

వివాహం కాలేదన్న మనస్తాపంతో స్థానిక లోనికోటకు చెందిన మహేశ్ (37) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లోనికోటకు చెందిన రామకృష్ణ కుమారుడు మహేశ్ ఎల్‌సీ కేషరంలోని ఇనుప సామాన్ల దుకాణంలో పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడు.అతడికి ఎన్ని సంబంధాలు చూసినా పెళ్లి కుదరలేదు. దీంతో మనస్తాపం చెందిన అతడు ఇంట్లోనే ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. మహేశ్ పనికి రాకపోవడంతో దుకాణ యజమాని ఫోన్ చేయగా.. స్విచాఫ్ వచ్చింది. దీంతో అతడి తల్లి సుబ్బమ్మకు సమాచారం ఇచ్చాడు. ఆమె ఇంటి వద్దకు వచ్చి చూసేసరికి మహేశ్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఆమె బోరున విలపించింది. సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.12 వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 54టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు చెప్పారు.

టమోటా కిలో రూ.22

అనంతపురం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.22తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠంగా రూ.12వేలు, సరాసరిగా రూ.16తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1,425 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

కొనసాగిన బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు రెండో రోజు సోమవారం కొనసాగాయి. స్థానిక నాయక్‌నగర్‌లో మూడు రోజులపాటు సాగే రాష్ట్రస్థాయి అండర్-17 షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలలో భాగంగా లీగ్, క్వార్టర్ ఫైనల్ పోటీలు నిర్వహించారు. చివరి రోజు మంగళవారం క్వార్టర్‌ఫైనల్‌లో గెలుపొందిన వారికి కేటగిరీల వారిగా సెమీస్, ఫైనల్స్ జరుగుతాయని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గయ్య చౌదరి, జయకుమార్ తెలిపారు.

స్వదేశీ వస్తువులకు మోదీ ప్రోత్సాహం

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆనాడు మహాత్మాగాంధీ, ప్రస్తుతం ప్రధాని నరేంద్రమోదీ స్వదేశీ వస్తువులను ప్రోత్సహించారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్ పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ అధ్యక్షతన సోమవారం ఆత్మనిర్భర్ భారత్ (సంకల్ప అభియాన్) సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుకర్ మాట్లాడుతూ స్వదేశీ వస్తువులు దేశంలో ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో వినియోగించాలని, మన దేశంలో వస్తువుల తయారీని ప్రోత్సాహించాలని కోరారు. స్వదేశీ వస్తువులు తయారు చేసే చిన్నచిన్న పరిశ్రమల స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. డిసెంబరు 25 వరకు గ్రామ స్థాయిలో స్వదేశీ వస్తువులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్, కార్యదర్శి నందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర సేల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్ రెడ్డి, ఆంజనేయులు, శ్రీదేవి, ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, దేవరాజు, కవితాశర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్

దళితుడైనందుకే దాడి యత్నం

- సీజేఐపై దాడిని ఖండించిన ప్రజాసంఘాలు

అనంతపురం టౌన్, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): దళితుడనే కారణంతోనే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై మతోన్మాదులు దాడికి యత్నించారని ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడిని ఖండిస్తూ ఐలు, సీఐటీయూ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ కూడలి వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు నాగేంద్రకుమార్, సతీష్, ప్రసన్నకుమార్, చంద్రిక, పరమేష్ తదితరులు దాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మానికి అవమానం జరిగిందనే పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై అడ్వకేట్ రాకేష్ కుమార్ కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసరడం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందన్నారు. దేశ అత్యున్నత స్థాయి పదవుల్లో ఉన్న దళితులకే ఈ గతి పడుతుంటే సామాన్యుల పరిస్థితేంటని ప్రశ్నించారు. అనంతరం సీజేఐపై దాడికి యత్నించిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఐలు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు వీరు యాదవ్, ప్రకాష్, హుస్సేన్, నాగమణి, గోపాల్, రామాంజనేయులు, చంద్రిక, శ్యామల, అశ్విని, గిరి, భీమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



టవర్‌క్లాక్ కూడలి వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఐలు, సీఐటీయూ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ధర్మవరం, హిందూపురం బాలసదనాలు, శిశుగృహాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ప్రమీల సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చన్నారు. అలాగే https//srisathya-sai.ap.gov.in వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 9 నుంచి 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. దరఖాస్తులను ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేసి, రసీదు పొందాలని పీడీ వివరించారు.

చెస్‌లో జిల్లాకు పతకాల పంట



పతకాలు సాధించిన జిల్లావాసులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత ఓపెన్ చెస్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. కర్ణాటకలోని బళ్ళారిలో ఆదివారం నిర్వహించిన ఇండియా ఓపెన్ అండర్-16 చెస్ పోటీల్లో జిల్లాకు చెందిన ఉదయ్‌కుమార్ నాయుడు 6 పాయింట్లతో రన్నరప్ టైటిల్ సాధించాడు. ఓపెన్ విభాగంలో జొన్నలగడ్డ నితీష్ 5 పాయింట్లతో ట్రోఫీ కైవసం చేసుకున్నాడు. అండర్-16 విభాగంలో త్రిపద బంగారు పతకం, అండర్-8 విభాగంలో నిహాల్ ద్వితీయస్థానం, అన్విత్ 12వ స్థానంలో నిలిచారు. అండర్-14 విభాగంలో దర్శన్ నాలుగోస్థానం, అండర్-10లో జనని 8వ స్థానంలో నిలవగా, యంగెస్ట్ ప్లేయర్‌గా శ్రీనిక్ రక్షణ్ నిలిచాడు.

ఆర్డీటీ కోసం 10 నుంచి దీక్షలు: సీపీఐ

గుంతకల్లు టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్డీటీ సేవలను తక్షణమే పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఈనెల 10వ తేదీ నుంచి సామూహిక దీక్షలు చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. స్థానిక బీటీ ఫక్కీరప్ప భవనంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు ఆర్డీటీ అపన్నహస్తం అన్నారు. ఎన్నో సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏని పునరుద్ధరించకపోవడం సరికాదన్నారు. అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కలేదన్నారు. ఇప్పటికే ఏడాది గడిచిందనీ, ఆర్డీటీ నిర్వహిస్తున్న హాస్పిటళ్లు మూతపడే పరిస్థితి దాపురించిందన్నారు. ఆర్డీటీ పరిరక్షణ కమిటీ పేరుతో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా, కులసంఘాలను ఏకం చేసి, ఈనెల 10 నుంచి గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద సామూహిక దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. 18న పెద్దఎత్తున ప్రజాప్రదర్శన నిర్వహించి, కేంద్ర హోంశాఖకు నిరసన తెలియజేస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, కార్యవర్గసభ్యుడు దేవేంద్ర పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న.. తొలి సమరయోధుడు

- వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు



వడ్డె ఓబన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

అనంతపురం క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తెల్లదొరలను ఎదుర్కొన్న మొదటి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న అని వడ్డెర సంఘం నాయకులు పేర్కొన్నారు. వడ్డె ఓబన్న 179వ వర్ధంతిని వడ్డెర సంఘం, జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు సోమవారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్డె వెంకటేశులు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారిపై పోరాడి వీర మరణం పొందాడని అన్నారు. ఆయన త్యాగాలు మరువలేనివని కొనియాడారు. అనంతపురం నగరం నడిమి వంకలోని గంగమ్మ దేవాలయం వద్ద ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం ముఖ్య నాయకులు మల్లెల జయరాం, దేవళ్ల మురళి, గోపాల్, వేణుగోపాల్, సుధాకర్, లక్ష్మన్న, గంగన్న, వెంకటరాముడు, మంజునాథ్, మారుతి, సూర్యప్రకాష్, మంజుల నారాయణ, వెంకటరాముడు, రమణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా తైక్వాండో జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి తైక్వాండో జట్టును సోమవారం ఎంపిక చేశారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీలను స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఆ వివరాలను స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రకటించారు. అండర్-14 బాలుర విభాగంలో మనోజ్ సాయి, భాగ్యరణ్, లోకేష్, గౌతమ్, స్మిత్‌బానా, గణేష్, రాహుల్‌కృష్ణ, మహ్మద్, ప్రశిత్ ఎంపికయ్యారు. అండర్-17 బాలుర జట్టులో కృష్ణ, బాలాజీ, శ్రీధర్, శ్రీకాంత్, ఎం మహేష్, ప్రసాద్, ఎస్ మహేష్, రాజేష్, వి లోకేశ్వరరావు, శ్రీనివాస్, సి లోకేశ్వరరావు, నవీన్, కిరణ్ చోటు దక్కించుకున్నారు. అండర్-17 బాలికల విభాగంలో భవాని, తరిణి, సాయినిషా, శ్రావణి, పుష్ప, సతీశ్వరి, సౌజన్య, ఏక్తా, నిష, యామిని, మంజుల ఎంపికయ్యారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్‌డీఓ రమణ, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాంతరాజ్, పీడీలు ప్రభాకర్, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని పాల్గొన్నారు.

ఎన్నెన్ని విన్నపాలో..!

- ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు రకరకాల సమస్యలు
- వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు: జేసీ


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అధికారులతో కలిసి ఆయన 375అర్జీలను స్వీకరించారు. జేసీతో పాటు డీఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, ఆనంద్, తిప్పేనాయక్, శ్రీనివాసులు, మల్లికార్జున, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... ప్రభుత్వం పీజీఆర్ఎస్ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మిగులు భూమి ఎక్కించండి...


సదాశివయ్య

మిగులు భూమిని తన పేరుతో ఎక్కించుకోవడానికి నానా తిప్పలు పడాల్సి వస్తోందని సదాశివయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. బొమ్మనహాళ్ మండలం బలనగొడ్డం గ్రామానికి చెందిన సదాశివయ్య కలెక్టరేట్‌లో అర్జీ అందజేశాడు. సర్వే నెంబరు 229లో 3.83 ఎకరాలలో 3.5ఎకరాలు తన పేరుతో ఆన్‌లైన్ ఉందని తెలిపాడు. మిగిలిన 33సెంట్లు ఆన్‌లైన్‌లో ఎక్కలేదన్నారు. అధికారులేమో మిగులు భూమి అని చెబుతున్నారన్నారు. ఆన్‌లైన్‌లో ఎక్కించే విషయంలో ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదన్నాడు.

డెత్ సర్టిఫికెట్‌లో పేరు మార్చారు


రహంతుల్లా

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి పేరును ఆధార్‌కార్డులో ఉన్న పేరు కాకుండా డెత్ సర్టిఫికెట్‌లో మరోపేరు నమోదు చేశారని పామిడికి చెందిన రహంతుల్లా వాపోయాడు. ఈమేరకు పీజీఆర్ఎస్‌లో అధికారులకు అర్జీ అందజేశాడు. తన బావమరిది షేక్ బాబా ఫక్రుద్దీన్ గత నెల 25న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని రహంతుల్లా తెలిపాడు. ప్రభుత్వాసుపత్రిలో డెత్ సర్టిఫికెట్‌లో సిబ్బంది పేరు మార్చారన్నారు. ఆధార్‌లో షేక్ బాబా ఫక్రుద్దీన్ ఉండగా డెత్‌సర్టిఫికెట్‌లో బాబావలి అని నమోదు చేశారన్నాడు. చివరికి నోటరీ తీసుకొచ్చినా మార్చలేదన్నారు. అక్కడి సిబ్బంది ఎవరికైనా చెప్పుకోమని దిక్కరిస్తున్నాడని వాపోయాడు. న్యాయం చేయాలని కోరాడు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నా..

తన పేరుతో ఆన్‌లైన్ భూమి ఎక్కించుకోవడానికి నాలుగేళ్లుగా తిరుగుతున్నా ఫలితం లేదని ఓ వృద్ధ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికలో యల్లనూరుకు చెందిన వృద్ధ రైతు రామచంద్రారెడ్డి అధికారులకు వినతిపత్రం అందజేశాడు. యల్లనూరు పరిధిలోని సర్వే నెంబరు 1644సీలో 2.86ఎకరాల భూమి ఉందన్నారు. కొన్నేళ్ల కిందట ఈ భూమిని మరొకరు తమ పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని తెలిపాడు. తరచూ ఫిర్యాదులు చేయడంతో వారి పేరు తొలగించారన్నాడు. కానీ ఆ భూమి తన పేరుతో ఎక్కించుకోవడానికి తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని వాపోయాడు. నాలుగేళ్లుగా తిరిగి అలసిపోయానని, ప్రమాదంలో కాలు విరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. కలెక్టరేట్ లోనూ నాలుగుసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరాడు.


రామచంద్రారెడ్డి

వేధిస్తున్న సిబ్బంది కొరత



తాడిమర్రిలోని విద్యుత్ సబ్‌స్టేషన్

● విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు

తాడిమర్రి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉన్న నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్లలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇక్కడ సిబ్బంది అరకొరగా ఉన్నా అవేమీపట్టనట్టుగా ఉన్నతాధికారులు ఇక్కడి వారిని అదనపు బాధ్యతలు అప్పగించి ఇతర ప్రాంతాలకు పంపుతున్నారు. దీంతో మండల ప్రజలు విద్యుత్ సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 4,800 వ్యవ సాయ విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. వాటిని వర్షాకాలంలో తప్పనిసరిగా జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుంది. అలాగే పోల్స్ సరిచేయడం, లైన్లు బాగుచేయడం, జంగిల్ క్లియరెన్స్, కొత్తవిద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడం తదితర వాటితో పాటు ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తినపుడు సిబ్బంది వెంటనే వెళ్లి పరిష్కరించాల్సి ఉంటుంది. మండలంలో పోల్ టు పోల్ సిబ్బంది, ఏఎల్ఎంలు, లైన్‌మన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్ల కొరతతో పాటు అసిస్టెంట్ ఇంజనీర్ స్థానం కూడా ఖాళీగా ఉంది. ఎనిమిది నెలలుగా విద్యుత్ శాఖ ఏఈని నియమించలేదు. బత్తలపల్లి మండలానికి చెందిన ఏఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ నలుగురు లైన్ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. అలాగే లైన్‌మన్‌లు, అసిస్టెంట్ లైన్‌మన్‌లు కూడా పూర్తి స్థా యిలో లేరు. వారి బదులుగా పోల్ టు పోల్ సిబ్బంది అయిన సరిగా ఉన్నారు అనుకుంటే వారు కూడా ఆరుగురే ఉన్నారు. దీంతో వర్షాకాలంలో ఏర్పడే విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. వీటికి తోడు బిల్లులు కట్టించే పని కూడా వారే చేయాల్సి వస్తోంది. రైతులు ఎవరైనా రెట్టించి అడిగితే తమ వద్ద తగిన సిబ్బంది లేరు... తాము ఏం చేయాలంటూ వారే ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సందర్భంలో అదనపు సిబ్బందిని కేటాయించ డం తప్ప వేరే మార్గం లేదని మండల ప్రజలు అంటున్నారు.

ఫ్యూజులు కూడా మేమే వేసుకుంటున్నాం



దాడితోట గ్రామానికి సంబంధించిన లైన్‌మన్ ఇటీవలే మృతిచెందాడు. మరొకరిని నియమించ లేదు. దీంతో విద్యుత్ సరఫరా పరంగా ఇక్కడ జరగాల్సిన పనులన్నీ కుంటుపడిపోతున్నాయి. ముఖ్యంగా మా గ్రామా లలో రైతులు ఎక్కువగా రాత్రిళ్లు మోటారు వేసేందుకు వెళ్తుంటారు. సమస్య ఎదురైనప్పుడు దానిని ఎవరైనా పరిష్కరిస్తారను కుంటే ఆలస్య మవుతోంది. దీంతో ఫ్యూజులు కూడా మేమే వేసుకుంటున్నాం. అధికారులు స్పందించి తగిన సిబ్బందిని కేటాయించాలి.

-అమర్‌నాథ్‌రెడ్డి, రైతు, దాడితోట

నివేదిక పంపాం

తాడిమర్రి మండలంలో నెలకొన్న సిబ్బంది కొరత గురించి ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. ఎంత త్వరగా సిబ్బందిని నియ మిస్తే అంత బాగా రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయగలుగు తామని వారి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సిబ్బందిని నియమిస్తారు.

- శివయ్య, ఇన్‌చార్జ్ ఏఈ

న్యూస్ బాక్స్

పంట కోత ప్రయోగాలు

బత్తలపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలపరిదిలోని దంపెట్ల గ్రామంలో సోమవారం వేరుశనగ పంటకోత ప్రయోగాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని సర్వే నంబర్ 196-1కే లక్ష్మమ్మకు చెందిన పొలంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించగా 640 గ్రాముల దిగుబడి వచ్చినట్లు ఏఎస్ఓ తెలిపారు. ఆర్డీఓ కార్యాలయ ఉప గణంకాల అధికారి గోపాల్ పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసులు, వీఏఏ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీఈఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

కొత్తచెరువు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన పూల శివను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. దీంతో 16 మంది మార్కెట్‌యార్డ్ డైరెక్టర్లతో పాటు పూలశివ చైర్మన్‌గా మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. కొత్తచెరువు లేబర్ ఆఫీసులో అనుసంధానం చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, జనసేన నాయకుడు భవానీశంకర్ హాజరుకానున్నట్లు పూల శివ సోమవారం ప్రకటనలో తెలిపారు.

ప్రయాణికుల నిరసన



రోడ్డకు అడ్డంగా వేసిన రాళ్లు

గాండ్లపెంట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేపరాల వద్ద బస్సులు నిలపడం లేదని పలువురు ప్రయాణికులు ప్రధాన రహదారికి అడ్డంగా రాళ్లు వేసి సోమవారం నిరసన తెలిపారు. కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలో పలు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. డ్రైవర్లు నిర్ణీత బస్‌స్టాపులలో సైతం బస్సులను నిలపకుండా వెళుతున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేపరాల మిట్ట వద్ద ఉన్న బస్టాండు సమీపంలో రహదారిపై రాళ్లు వేసి బస్సులు ఆపే ప్రయత్నం చేశారు. అయినా బస్సులను నిలపకుండ వెళ్లి పోవడంపై అసహనం వ్యక్తం చేస్తు నిరసన చేపట్టారు. గంటల కొద్దీ వేచిఉంటున్నా ఫలితం లేక పోవడంతోనే రహదారికి రాళ్లు అడ్డంగా వేసినట్లు ప్రయాణికులు తెలిపారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని బస్‌స్టాపుల లో బస్సులు నిలిపేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

అక్షయ ఐ కేర్ ఎండీ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న అక్షయ ఐ కేర్ ఎండీ గుడిపాటి సురేశ్‌చౌదరి

ధర్మవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సామాజిక వేత్త, ఐటీ నిపుణులు, అక్షయ ఐకేర్ ఎండీ గుడిపాటి సురేశ్‌చౌదరి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని కొత్తపేట సాయిభారతి సేవాసమితి మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఆయన విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

పరిటాల శ్రీరామ్‌కు సత్కారం



పరిటాల శ్రీరామ్‌కు గజమాల వేసి సత్కరిస్తున్న నాయకులు

ధర్మవరం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేనిపల్లిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌కు ఘనస్వాగతం పలికారు. సోమవారం తుమ్మల గ్రామానికి వెళ్తున్న పరిటాలశ్రీరామ్‌కు టీడీపీ నాయకుడు మల్లేనిపల్లి చంద్ర ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాల వేసి ఘనంగా సత్కారించారు. ఆ గ్రామంలో నెలకొన్న సమస్యలపై పరిటాలశ్రీరామ్ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపారని గ్రామస్థులు కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డీలర్ రామ్మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

బత్తలపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ సురేంద్రనాయుడును సోమవారం ఆ పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. సురేంద్రనాయుడు గత కొద్ది రోజుల క్రితం కిడ్నీ ఆపరేషన్ చేయిం చుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పరిటాల శ్రీరాం బత్తలపల్లిలోని సురేంద్రనాయుడు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యపరిస్థిని అడిగి తెలుసుకున్నారు. నాయకులు మహేష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ వీఆర్వో మృతికి ఎమ్మెల్యే సంతాపం

నల్లచెరువు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నివాసముంటున్న విశ్రాంత వీఆర్ఓ రాజశేఖర్‌రెడ్డి తన నివాసంలో అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన మృతికి ఆయన సమీప బంధువులైన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ట్యాంకుపై నుంచి పడి తూర్పుగోదావరి జిల్లా వాసి మృతి



రాజ్‌కుమార్ మృతదేహం

ధర్మవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారు తీనగర్‌లో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకుపై నుంచి కిందకు పడి తూర్పుగోదావరి జిల్లాకు రాజ్‌కుమార్(39) అనే వ్యక్తి మృతిచెందినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి మం డలం పీడింగొయ్య గ్రామానికి చెందిన గెడ్డం రాజ్‌కుమార్(39) ధర్మవరం పట్టణంలోని మారుతీనగర్‌లో చేపట్టిన వాటర్ ట్యాంకు నిర్మాణానికి కూలి పనులు చేయడానికి 15 రోజుల క్రితం వచ్చాడు. అతడికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వాటర్ ట్యాంక్ నుంచి కిందకుపడి మృతిచెందాడు. ఈ విషయాన్ని గెడ్డం రాజ్‌కుమార్ తమ్ముడు గెడ్డం ప్రసాద్‌కు కాంట్రాక్టర్ ఫోన్ చేసి తెలిపారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు సోమవారం ధర్మవరం చేరుకున్నారు. అనంతరం గెడ్డం ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు సీఐ రెడ్డప్ప తెలిపారు.

వెలుగులు నింపాలని..

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి, విద్యుత్ అధికారులు

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): లోఓల్టేజీ సమస్యను అధిగమించేందుకు మండలంలోని వెంగళమ్మచెరువు గ్రామంలో రూ.4 కోట్లతో నిర్మించ తలపెట్టిన సబ్ స్టేషన్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నియోజకవర్గంలో లోఓల్టేజీ సమస్యలను అధిగమించేందుకు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ శివరాం, డీఈ (కన్‌స్ట్రక్షన్స్) శ్రీధర్, నేతలు విజయ్‌కుమార్, సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నల్లచెరువు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఉబిచెర్ల గ్రామ పంచాయతీ గోరంట్ల వారిపల్లిలో సోషల్ యాక్టివిటి ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా అమలు అవుతున్న పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఎంపీడీఓ రామక్రిష్ణ సోమవారం అవిష్కరించారు. మొదటి దశలో రూ. 2లక్షల వ్యయంతో గాజిగాన్‌గుట్టలో పచ్చదనం పెంపొందించడానికి, ఉమ్మడి వనరుల సంరక్షణకు శంకుస్థాపన చేశామని ఎంపీడీఓ తెలిపారు. సీడ్ బాల్స్ చల్లించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ ఆర్గనైజర్ విశ్వేశ్వర, కార్యదర్శి నాగేశ్వరరెడ్డి, ఇమ్రాన్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్‌తో అనుసంధానం చేసుకోండి

● సహాయ కార్మిక శాఖ అధికారి

ధర్మవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ధర్మవరం సహాయ కార్మిక శాఖ కార్యాలయ పరిధిలోని భవన నిర్మాణ కార్మికులందరూ తమ రిజిస్ట్రేషన్ నంబర్‌కు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాను అనుసంధానం చేసుకోవాలని సహాయ కార్మిక శాఖ అధికారి నరేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తచెరువు లేబర్ ఆఫీసులో అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. 50 రోజులు పనిదినాలు దాటిన ఉపాధి హామీ కూలీలు, భవన నిర్మాణ కార్మికులను నమోదు చేస్తారన్నారు. అలాగే పట్టణంలోని మోటారు ట్రాన్స్‌పోర్టు వారు కూడా కార్మికచట్టం ప్రకారం కార్మిక శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వాటర్ ప్లాంట్ల ప్రారంభం

కొత్తచెరువు/నల్లమాడ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ మలేషియా, సింగపూర్ దేశాలకు చెందిన సత్యసాయి భక్తులు సోమవారం కొత్తచెరువు మండల పరిధిలోని ఇరగంపల్లిలో సురక్షిత తాగునీరు అందించేందుకు వాటర్‌ప్లాంటును ప్రారంభించారు. అలాగే సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ మలేషియాకు చెందిన మహేంద్రన్ అర్ముగం, శ్రీబాబా, గీత నల్లమాడ మండలంలోని బొగ్గలపల్లికి వాటర్ ప్లాంట్‌ను అందించి ప్రారంబించారు. వాటర్‌ప్లాంటుకు తన స్థలాన్ని ఇచ్చిన గ్రామానికి చెందిన సత్యసాయి భక్తుడు మోపూరి సురేశ్‌ను అభినందించారు.ఈ కార్యక్రమాల్లో సత్యసాయిబాబా జాతీయ సేవావిభాగం కోఆర్డినేటర్ ఎస్ కోటేశ్వరరావు, సత్యసాయి భక్తులు విశ్వనాథ్‌రెడ్డి, మలేషియా, సింగపూర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ధర్మవరం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడన్నపల్లి సమీపంలో సోమవారం ఓ ద్విచక్రవాహనాన్ని ఎదురుగా ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పుట్టపర్తికి చెందిన హబీబుల్లా, రాజేష్ అనే యువకులు ద్విచ క్రవాహనంలో పుట్టపర్తి నుంచి అనంతపురం వెళుతున్నారు. అయితే మార్గమధ్యలో బడన్న పల్లి సమీపాన ఎదురుగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న హబీబుల్లా, రాజేష్ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడ్డవారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అమడగూరు వాసి తనకల్లులో మృతి

తనకల్లు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలానికి చెందిన వెంకటప్ప(67)అనే వ్యక్తి మండలంలోని ముండ్లవారిపల్లి సమీపంలో పాపాగ్ని నదీ పరివాహక ప్రాంతంలో సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. వెంకటప్పకు కుటుంబసభ్యులు ఎవరూ లేరు. అతడు పదేళ్లుగా తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్‌లో వివిధ హోటళ్ల పనిచేసే వాడు. అన్ని కార్యక్రమాలకు వంట పనుల్లో పనిచేసే వాడు. మద్యానికి బానిసయ్యాడు. ముండ్లవారిపల్లి సమీపంలో ఓ మృతదేహం ఉన్నట్లు సోమవారం పోలీసులకు సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించారు. వెంకటప్పదిగా గుర్తించారు. అయితే ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. కోటపల్లి వీఆర్ఓ గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సత్యసాయి గిరిప్రదక్షిణను సోమవారం రాత్రి భక్తులు ఘనంగా నిర్వహించారు. రాత్రి 6-30 గంటల సమయంలో గణేశ్ గేటు వద్ద సత్యసాయి రథానికి ప్రత్యే క అలంకరణ చేసి పూజలు చేశారు. రథాన్ని లాగుతూ భక్తి పాటలతో గోకులం, ఎనుముల పల్లిసర్కిల్, పెట్రోల్ బంక్, చింతతోపు, గోవిందపేట, శివాలయం వీధి, గోపురం రోడ్డుమీదుగా సాగి తిరిగి గణేశ్ గేటు వద్ద ముగించారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి

ధర్మవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు వడ్డె ఓబన్న అని వడ్డెర సంఘం నాయకులు డేరంగుల అంజి, మంజుల, నరేంద్ర పేర్కొ న్నారు. వడ్డె ఓబన్న 179వ వర్ధంతి సందర్భంగా స్థానిక సిరికల్చర్ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్లెల దివాకర్, మల్లెల నారాయణస్వామి, వల్లెపు సుధాకర్, డేరంగుల సూర్యనారాయణ, కుంచపు శేషు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి తుమ్మల గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ -ధర్మవరం రూరల్

జీఎస్టీపై అవగాహన సదస్సులు



బాలికల ఉన్నత పాఠశాలలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అధికారులు

కదిరి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు పాఠశాలల్లో సోమవారం జీఎస్టీపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు ఎంఈఓ చెన్నక్రిష్ణ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ... ఇప్పటికే జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం, విద్యాకమిటీ చైర్మ న్ సుజాత, ఉపాధ్యాయురాలు నరసమ్మ, పాల్గొన్నారు. అలాగే బాలుర ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నతపాఠశాల, రాణీపేట ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించారు.

● కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత మాట్లాడారు. అధ్యాపకులు శంకర్, హైదర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

కొత్తచెరువు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొడపగాని పల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు ధర్మవరానికి చెందిన మధుబాబు క్రీడాదుస్తులను సోమవారం పంపిణీచేశారు. రూ.10వేలు విలువ చేసే క్రీడాదుస్తువులను అందించారని పాఠశాల హెచ్ఎం మంజులవాణి తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

● కదిరి: తలుపుల మండలంలోని దేవరపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఫ్రెండ్స్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు.

హోంగార్డు ప్రియాంకకు న్యాయం చేయాలి

● మాజీ మంత్రి ఉష శ్రీచరణ్ డిమాండ్

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గోరంట్ల పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న ప్రియాంకకు న్యాయం చేయాలని మాజీ మంత్రి ఉషాశ్రీచరణ్ డిమాండ్‌చేశారు. ఆమె సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిశారు. అనంతరం ఆమె జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ హోంగార్డు ప్రియాంకకు న్యాయం చేయాలని ఎస్పీని కోరామన్నారు. ప్రియాంకను వేధించిన వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పెనుకొండ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల

అమరాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో 40 మంది వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై హేమావతి, గొల్ల మారనపల్లి పంచాయతీకి చెందిన రంగనాథ్, కిరణ్‌కుమార్, శివన్నతో పాటు 40మంది వైసీపీకి రాజీనామాచేసి మడకశిర టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు జయకుమార్, గొల్లమారనపల్లి రామచంద్రప్ప, తిప్పజ్జ, కృష్ణమూర్తి, నాగరాజు, శివకుమార్, కృష్ణప్ప, రంగస్వామి, డీలర్ తిరుమలగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ గౌడరంగప్ప, అంజినప్ప, చిక్కన్న పాల్గొన్నారు.

అనధికార వధశాల కూల్చివేత



మోతుకపల్లి వద్ద పశువధశాలను కూల్చివేస్తున్న దృశ్యం

హిందూపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని మోతుకపల్లి సమీపంలో అనధికారికంగా నిర్వహిస్తున్న జంతు వధశాలను అధికారులు కూల్చివేశారు. రెండ్రోజుల క్రితం పశువులను తీసుకెళ్లి వధించడానికి సిద్ధంగా ఉంచారు. సమాచారం అందుకున్న పోలీసులు, మున్సిపల్ అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించగా వధశాలకు అనుమతిలేదు. అక్కడున్నవారికి హెచ్చరించి సోమవారం మున్సిపల్ అధికారులు పోలీసుల సహకారంతో అన్నింటిని కూల్చివేశారు. రహమత్‌పురంలో అనధికారికంగా వైసీపీ నాయకుడు పశువధశాలను నిర్వహిస్తున్నాడు. దీనిని కూడా కూల్చివేశారు. కొన్నేళ్లుగా హిందూపురంలో మాంసం వ్యాపారులు అనధికారికంగా జంతు వధశాలను నిర్వహిస్తూ మాంసాన్ని బెంగళూరు, హైదరాబాదుకు ఎగుమతి చేసేవారు. ఉన్నతాధికారులు ఆదేశాలతో ఈ చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు.

మడకశిరలో సినీ నటుడు నరేష్



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న నరేష్

మడకశిర టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఎంఎస్ రాజు క్యాంపు కార్యాలయంలో సోమవారం సినీ నటుడు నరేష్ సందడి చేశారు. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడారు. ఎమ్మెల్యే పనితీరు బాగుందని, నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించాల్సిందేనన్నారు. పేద ప్రజలకు అందిస్తున్న సేవలతో పాటు అధికార యంత్రాంగంతో సక్రమంగా పనిచేయించడం, ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తుండడం తనను ఆకట్టుకుందని నరేష్ అన్నారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు పాల్గొన్నారు.

చెరువుకు గండి



గండిని పూడుస్తున్న టీడీపీ నాయకులు, స్థానికులు

సోమందేపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులబల్లాపురం చెరువుకు సోమవారం గండిపడింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరదనీరు చేరి మంచేపల్లి చెరువు మరువపారింది. ఈ దిశలో మరువనీరు పెద్దఎత్తున ఈదులబళాపురంచెరువుకు చేరడంతో కట్టతెగి గండిపడినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు నర్సింహమూర్తి, చెరువు ఆయకట్టు అధ్యక్షుడు కిష్టప్ప గ్రామస్థులతో కలిసి చెరువు వద్దకు చేరుకుని ఇసుక బస్తాలను వేసి గండిని పూడ్చారు. నీటి ప్రవాహాన్ని నియంత్రించి ఇరిగేషన్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు.

రైతులకు యూరియా పంపిణీ

గోరంట్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు సహకార సంఘం ద్వారా 280 బస్తాల యూరియాను సోమవారం రైతులకు పంపిణీ చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు గుత్తా వెంకటరమణ తెలిపారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే వెంటనే తెప్పించినట్లు ఆయన తెలిపారు. ఒక పాసు పుస్తకానికి రెండు బస్తాలు ఇస్తున్నట్లు తెలిపారు. లోడు దించిన గంటలోనే యూరియా అయిపోయిందన్నారు. మరో లారీని తెప్పిస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్లు నాగేష్, శ్రీనివాసులు, కూటమి నాయకులు సంతోష్, రాఘవనాయుడు, హరి, గట్టు చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న సొసైటీ అధ్యక్షుడు

ఇచ్చిన మాటను నెరవేర్చిన ఘనత కూటమిదే

● ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ



ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అమరాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వీరశైవ కల్యాణమండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా లక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆలయ కమిటీవారిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరో ఒకరి చేతుల్లో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని పెట్టుకుని తమ ఆధిపత్యాన్ని వైసీపీ నాయకులు చలాయించారన్నారు. 150ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని శిథిలావస్థకు తెచ్చారని ఆరోపించారు. ఎన్నికల్లో తమకు అండగా నిలిచి గెలిపించిన ఆర్యవైశ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దేవదాయ శాఖ అధికారులతో చర్చించి ఆలయాభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్, తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ రామారావు, దాదాపీర్, నరసింహమూర్తి, జయకుమార్, నాగరాజు, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

మడకశిర టౌన్ (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకున్నపుడే వారు భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా రాణిస్తారని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామితో కలసి మహాత్మాగాంధీ లెదర్ బాల్ టీ20 క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా మడకశిర సింహగిరి జట్టు నిలువగా రూ.30వేలతో పాటు ట్రోఫీని అందజేశారు. రన్నర్స్ సోమందేపల్లి జట్టుకు రూ.20 వేలు, ట్రోఫీని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాల వల్ల యువతలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ప్రాంతాలకు పేరు రావాలన్నా, గ్రామీణ అభివృద్ధి చెందాలన్నా క్రీడలు కూడా దోహదపడతాయన్నారు. క్రీడాభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. భవిష్యత్తులో మరిన్ని పోటీలు నిర్వహించడం వల్ల మడకశిర ప్రాంతానికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పుట్టకామప్ప, బలరామ్, నాగేంద్ర పాల్గొన్నారు. రొళ్ల (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తూకం, జీఎస్టీపై డీలర్లకు అవగాహన కల్పించారు. పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ప్రతి డీలరు బియ్యాన్ని తూకం సరిగా వేయాలని సూచించారు. రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.

వాల్మీకి అడుగుజాడల్లో నడుద్దాం: ఎంపీ



సంఘీభావం తెలుపుతున్న ఎంపీ అంబికా, వెంకటేశ్వర్లు, వాల్మీకి సంఘం నాయకులు

రొద్దం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజసేవ కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు వాల్మీకి మహర్షి అడుగుజాడల్లో నడుద్దామని అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం రొద్దంలో వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా ఎంపీ, మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్‌రావు హాజరయ్యారు. విగ్రహావిష్కరణ అనంతరం వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు టీడీపీ కృషి చేస్తుందన్నారు. సమాజసేవకోసం ప్రతి వాల్మీకి పాటుపడాలని పిలుపునిచ్చారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్, మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణ, నాయకులు చంద్రశేఖర్, డీసీ ఆంజనేయులు, చంద్రశేఖర్, నరహరి, వై.చంద్రశేఖర్, వాల్మీకి పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను వినియోగించుకోండి



పోస్టర్లు విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే పీఏ

హిందూపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 10వ తేదీన ఎస్డీజీఎస్ కళాశాలలో జరిగే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర కోరారు. సోమవారం మెగాజాబ్‌మేళాకు సంబంధించి మునిసిపల్ కార్యాలయం వద్ద పోస్టర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 15 బహుళ జాతీయ కంపెనీలు జాబ్‌మేళాకు వస్తున్నాయని, హిందూపురం నియోజకవర్గంతోపాటు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10వ తరగతి ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన విద్యార్థులు 18-35ఏళ్లలోపు వారు అర్హులన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ శివప్రసాద్, చేనేత జౌళిశాఖ ఏడీ రామక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, బాలాజీ, పవన్ పాల్గొన్నారు.

భూ రీ సర్వేపై ర్యాలీ

పరిగి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గతంలో నిర్వహించిన భూరీసర్వేపై మండల వ్యాప్తంగా రైతులు అవగాహన కలిగించే విధంగా పి. నర్సాపురం గ్రామంలో తహసీల్దార్ హసీనాసుల్తానా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రీసర్వేలో రైతులకు ఎటువంటి తప్పులు లేకుండా సరిహద్దులు చేయించామన్నారు. రైతులకు రీసర్వేపై ఏవైనా తప్పొప్పులుంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అనంతరం గ్రామసభ నిర్వహించి రైతులు, ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, ఆర్‌ఐ సిద్దేశ్, మాజీ ఎంపీటీసీ సోమప్ప పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు ఆపండి

పెనుకొండ టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కోర్టులో పరిష్కారమయ్యేవరకు మా భూమిలో అక్రమ నిర్మాణాలు ఆపాలని బాధితులు కుల్లాయప్ప, హుస్సేన్‌బీ కోరారు. సోమవారం ఆర్డీఓకు వారు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ సోమందేపల్లి మండలం సర్వే నంబరు 145-1లో 4.87ఎకరాల్లో 20ఏళ్ల నుంచి సాగుచేస్తున్నామన్నారు. గతంలో హంద్రీనీవా కాలువకు సగం పోయిందన్నారు. ఎకరం భూమికి 2015లో పట్టా ఇచ్చారని, అందులోనే ఇల్లుకట్టుకుని వ్యవసాయం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల గొల్ల మహేష్, గొల్ల రాజగోపాల్ తదితరులు వ్యవసాయ పొలంలో గుడికడతామని రాత్రికి రాత్రే షెడ్డువేశారని, దీనిపై కోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టు తీర్పు ఇచ్చేంతవరకు నిర్మాణ పనులు ఆపాలని ఆర్డీఓను కోరామన్నారు.

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు నలుగురే..!



తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న మహిళ

రొళ్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక తహసీల్దార్ షెక్షావలి అధ్యక్షతన నిర్వహించారు. తహసీల్దార్, వ్యవసాయాధికారి వెంకటబ్రహ్మం, ఎంపీడీఓ బదులుగా జూనియర్ అసిస్టెంట్, పోలీస్‌శాఖ నుంచి రామలింగయ్య మాత్రమే హాజరయ్యారు. వివిధశాఖల నుంచి అనేకమంది అర్జీదారులు హాజరయ్యారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా రానివారి గురించి ఉన్నతాధికారులకు వివరిస్తామన్నారు. అర్జీదారుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కేరళ మాజీ డీజీపీ

మడకశిర రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ శ్రీరామిరెడ్డి జయంతి సందర్భంగా వారం రోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా కేరళ రాష్ట్ర మాజీ డీజీపీ సయ్యద్ మహమ్మద్ యాసన్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి పాల్గొన్నారు. విన్నర్స్‌గా నీకంఠాపురం ఉన్నత పాఠశాల జట్టు, రన్నర్స్‌గా రొళ్ళ గురుకుల పాఠశాల నిలిచింది. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. నియోజకవర్గంలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థు నగదు బహుమతులు అందజేశారు. గోవిందపురం, గంగుళవాయిపాళ్యం పంచాయతీల్లో ఉత్తమ రైతులకు నగదు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కేటీ శ్రీధర్, పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

పెనుకొండ రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిమడుగు గ్రామంలో మాజీ ఎంపీపీ చిన్నవెంకటరాముడు వ్యవసాయ పొలంలో దుండగులు కేబుల్ ఎత్తుకెళ్లారు. బాధితుడు తెలిపిన మేరకు వ్యవసాయ బోరుకు అమర్చిన కేబుల్‌ను ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు కత్తిరించారన్నారు. రూ.50వేలు విలువ ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనపై కియ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పొలంలో స్టార్టర్లు..

పెనుకొండ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిమడుగు గ్రామంలో మాజీ ఎంపీపీ చిన్నవెంకటరాముడు పొలాల్లో బోర్లకు అమర్చిన రెండు స్టార్టర్లను ఆదివారం రాత్రి దుండగులు ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపారు. చోరీ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

హిందూపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో 988మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్ సాధించిన బాలాయేసు కళాశాల విద్యార్థిని సాదియాకు ల్యాప్‌టాప్ బహూకరించారు. సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాంరెడ్డి, బాలయేసు ప్రిన్సిపాల్ శౌడిరెడ్డి ల్యాప్‌టాప్ అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఇంటర్ ఫలితాల్లో మూడో ర్యాంక్ సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. ప్రతి విద్యార్థి అమ్మాయిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

బోధనతోపాటు క్రమశిక్షణ అవసరం

హిందూపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు బోధనతోపాటు క్రమశిక్షణ ఉండటం అవసరమని ఉపాధ్యాయ శిక్షణలో పాల్గొన్న ఎస్సీఆర్‌పీ పరిశీలకుడు వెంకటేశ్వర్‌రావు అన్నారు. బిట్ కళాశాలలో నాలుగోరోజు శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. కాలానుగుణంగా విద్యాబోధనను అలవర్చుకోవాలన్నారు. బోధనతోపాటు సాంస్కృతి, సంప్రదాయాలు అలవర్చుకోవాలన్నారు. ఎంఈఓలు పాల్గొన్నారు.

వెంకటగిరిపాళ్యంలో పోలీసుల బందోబస్తు

పెనుకొండ రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పిల్లల గొడవ విషయంలో యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య, తుపాకుల కుటుంబానికి మధ్య ఘర్షణ తలెత్తి ముగ్గురు గాయపడిన సంఘటన తెలిసిందే. సోమవారం ఎస్‌ఐ రాజేష్, సిబ్బందితో వెళ్లి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

టమోటా వాహనాల బోల్తా



రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన టమోటాలు

లేపాక్షి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): హిందూపురం నుంచి జాతీయ రహదారిపై బాగేపల్లి వెళ్తున్న రెండు టమోటా వాహనాలు లేపాక్షి గలిబిపల్లి క్రాస్‌వద్ద సోమవారం తెల్లవారుజామున బోల్తాపడ్డాయి. పోలీసులు తెలిపిన మేరకు హిందూపురం నుంచి ఐచర్, బొలేరో రెండు వాహనాల్లో టమోటాలతో వెళ్తున్నాయి. గలిబిపల్లిక్రాస్ వద్దకు రాగానే వాహనాలు ఓవర్‌టేక్ చేయడానికి వెళ్లి డివైడర్లను ఢీకొన్నాయి. అందులో ఉన్న టమోటాలు రోడ్డుపై చల్లాచదురుగా పడ్డాయి. డ్రైవర్లకు, రైతులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ట్రైనీ ఎస్‌ఐ చెన్నయ్య ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

● చేనేత సంఘం నాయకుల డిమాండ్

సోమందేపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు చిన్ననారాయణస్వామి డిమాండ్ చేశారు. సోమవారం షిర్డీనగర్‌లో చేనేత కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేతిమగ్గాలకు 200యూనిట్లు, మరమగ్గాలకు 500యూనిట్లు ఇస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు ఆగస్టు 7న ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. అయితే ఇప్పటి వరకు అది కార్యరూపం దాల్చలేదన్నారు. విద్యుత్ అధికారులు తమకు ఎలాంటి ఆదేశాలు, ఉత్తర్వులు అందలేదని చెబుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉచిత విద్యుత్ పథకం అమలు జరిగేలా చూడాలన్నారు. దేవాంగం వెంకటేశులు, మంచూరి ఈశ్వర్, పురుషోత్తం, కుమ్మర సంజీవప్ప, శ్రీరాములు, గోవిందప్ప, రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చేనేత సంఘం జిల్లా నాయకులు



మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్ సరోజా నాగేనాయక్

గోరంట్లకు స్వచ్ఛాంధ్ర అవార్డు

గోరంట్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి శిల్పారామంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో గోరంట్ల మేజర్ గ్రామపంచాయతీకి సోమవారం ఉత్తమ సేవా పురస్కారం లభించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ శ్యాంప్రసాద్ చేతుల మీదుగా సర్పంచు సరోజా నాగేనాయక్ అవార్డు అందుకున్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ డంపింగ్ యార్డ్ ద్వారా వర్మీ కంపోస్ట్ ఎరువులు తయారుచేసి రైతులకు అందజేయడంలో ప్రత్యేక పాత్ర పోషించింది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లెసింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అవార్డు అభించడం పట్ల సర్పంచును పలువురు కూటమి నాయకులు స్థానికులు అభినందించారు.



కలెక్టర్, ఎమ్మెల్యే నుంచి అవార్డు అందుకుంటున్న చంద్ర

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న చంద్ర ఉత్తమ సేవకు గుర్తింపుగా జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర వారియర్ అవార్డును అందుకున్నాడు. సోమవారం పుట్టపర్తి శిల్పారామంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి సత్యకుమార్, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ చేతులమీదుగా చంద్ర అవార్డును అందుకున్నాడు. కమిషనర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ చంద్ర అవార్డును అందుకోవడం తమకు గర్వంగా ఉందన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్లు మంజునాథ్, పర్వీన్‌బాను, శానిటరీ కార్యదర్శి బాబుప్రసాద్ పాల్గొన్నారు.



మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్ రత్నమ్మ

హిందూపురం (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర అవార్డు తూమకుంట పంచాయతీకి రావడంతో మాపై బాధ్యత పెరిగిందని సర్పంచ్ రత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి కెంచారాయుడు అన్నారు. సోమవారం పుట్టపర్తిలో మంత్రి సత్యకుమార్ చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. వారు మాట్లాడుతూ మండలంలో పంచాయతీకి అవార్డుకు ఎంపిక కావడం గర్వంగా ఉందని, భవిష్యత్తులో కూడా ఇదేరకంగా పంచాయతీని అభివృద్ధి చేస్తానని అన్నారు.

మంత్రిపై అసత్య ఆరోపణలు తగదు

● కూటమి నాయకులు



మాట్లాడుతున్న కూటమి నాయకులు

గోరంట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డ్ ప్రియాంక బాయి ఆత్మహత్యాయత్నం ఘటనపై వైసీపీ జిల్లా అధ్యక్షులు ఉష శ్రీచరణ్ మంత్రి సవితపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, రాజకీయ లబ్ధికోసమే లేనిపోని నిందలు వేస్తున్నారని కూటమి నాయకులు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆత్మహత్యాయత్నం ఘటనపై మంత్రి సవిత పార్టీ నాయకులతో సంప్రదించారని, చర్యలు చేపట్టే విషయమై పోలీసులకు తగిన సూచనలు ఇచ్చినట్లు రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్ తెలిపారు. మంత్రి జోక్యం చేసుకోలేదని అనడం సబబు కాదన్నారు. మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాగే నాయక్, రవీంద్ర నాయక్, నిమ్మల శ్రీధర్, బెల్లంచెరువు చంద్ర మహమ్మద్, సురేష్ పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్ ఎదుట వైసీపీ ఆందోళన



నినాదాలు చేస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, నాయకులు

గోరంట్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి యత్నించిన ప్రియాంకబాయికి మద్దతు పలుకుతూ వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గోరంట్ల పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. గోరంట్లలో పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న ప్రియాంకబాయి ఇద్దరు ప్రవేటు కారు డ్రైవర్లు తనను వేధిస్తున్నారంటూ సెల్ఫీ వీడియోతో విషద్రావకం తాగి ఆదివారం ఆత్మహత్య యత్నానికి యత్నించిన విషయం తెలిసిందే. వైసీపీ అధ్యక్షురాలు పార్టీ అనుచరులతో కలసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి హోంగార్డు ఘటనపై సీఐ శేఖర్‌తో వాగ్వాదానికి దిగారు. ఘటనపై కేసు ఎందుకు నమోదు చేయలేదని, నిందితులను ఎందుకు శిక్షించలేదని ప్రశ్నించారు. హోంగార్డు భార్య, భర్తల మధ్య విభేదాలు ఉండడంతోనే కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెబుతుండగానే ఆమె అడ్డుపడ్డారు. అనంతరం స్టేషన్ బయటకు వెళ్లి రోడ్డుపై నాయకులు బైఠాయించి ధర్నా చేపట్టారు. మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, దీనిపై ఎస్పీ ఫిర్యాదు చేస్తామన్నారు. బంజార సంఘం నాయకులు ఆంజనేయులు నాయక్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

చెట్లను నరికేస్తున్న ట్రాన్స్‌కో కాంట్రాక్టర్లు



తురకలాపట్నం గ్రామం వద్ద చింతచెట్టు కొమ్మలను నరికేసిన దృశ్యం

రొద్దం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఒక చెట్టు కొమ్మ కొట్టాలంటే సవాలక్ష అనుమతులు తీసుకోవాల్సి ఉండగా రోడ్డుపక్కనే ఉన్న చెట్లను అడ్డంగా నరికేస్తున్నారు ట్రాన్స్‌కో కాంట్రాక్టర్లు. మండలంలోని తురకలాపట్నం, బొక్సంపల్లి గ్రామాల్లో రోడ్డుపక్కనే విద్యుత్ స్తంభాలు వేస్తున్నారు. కడపకు చెందిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ సంస్థవారు విద్యుత్ స్తంభాలు, వైర్లు వేస్తున్నారు. రోడ్డుపక్కనే ఉన్న 15ఏళ్లనాటి చెట్ల పెద్దకొమ్మలు నరికేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా నిబంధనలు ఉల్లంఘించి చెట్లను నరికేస్తున్నారన్న విమర్శలున్నాయి. అక్కడే కాంట్రాక్ట్ పనులు చేస్తున్న సిబ్బందిని విచారించగా అనధికారికంగా అనుమతులు పొందామన్నారు. దీనిపై తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజును వివరణ కోరగా రెవెన్యూశాఖ నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదని ఘటనా స్థలాన్ని పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.